

కుమారా.. అసెంబ్లీకి రా చర్చిద్దాం: డీకే సవాల్

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'మిస్టర్ కుమారస్వామి నువ్వు మండ్యలో గెలవలేవు... అసెంబ్లీలో చర్చిద్దాం రా.. నాపై చేసిన ఆరోపణలకు అక్కడే సమాధానం చెబుతా' అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సవాల్ విసిరారు. సోమవారం బెళగావిలో అభ్యర్థి మృణాల్ హెబ్బాళ్కర్ నామినేషన్ సందర్భంగా డీకే మీడియాతో మాట్లాడుతూ నీవు ఎలాంటి అబద్ధాలకోరు, మోసగాడివో అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. తాను రాళ్లు అమ్మానో చోరీ చేశానో అది కూడా చూద్దామన్నారు. కుమారస్వామి మహిళలను అవమానించారన్నారు. ఆయన హిట్ అండ్ రన్‌లో ఫేమస్ అని, పిక్‌ప్యాకెట్ల అలవాటు ఉందన్నారు.

జోరుగా నామినేషన్లు

- బరిలోకి దిగుతున్న హేమాహేమీలు
- ప్రముఖ నేతల హాజరు



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ధార్వాడ బీజేపీ అభ్యర్థి ప్రహ్లాద్‌జోషి



శివమొగ్గ కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్..

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండో విడతలో నామినేషన్ల జోరుగా సాగింది. సోమవారం మంచిరోజుగా భావించి హేమాహేమీలు నామినేషన్లు దాఖలు చేశారు. ధార్వాడ నుంచి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి నామినేషన్ వేశారు. ఆయనతోపాటు బీజేపీ అగ్రనేత యడియూరప్ప, అరవింద్ బెల్లద్, జగదీశ్‌శెట్టర్ పాల్గొన్నారు. హావేరి నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి శివరాం హెబ్బార్‌తోపాటు ప్రముఖులు పాల్గొన్నారు. బెళగావి నుంచి జగదీశ్‌శెట్టర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఎంపీ మంగళా అంగడి, మాజీ మంత్రి సతీశ్‌జార్కిహొళి ఉన్నారు. శివమొగ్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గీతాశివరాజ్‌కుమార్ నామినేషన్ వేశారు. నటుడు శివరాజ్‌కుమార్, మాజీ మంత్రి కిమ్మనె రత్నాకర్ పాల్గొన్నారు. బెళగావి కాంగ్రెస్ అభ్యర్థిగా మృణాల్ హెబ్బాళ్కర్ నామినేషన్ వేశారు. మృణాళ్ వెంట తల్లి, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, ఎమ్మెల్సీలు ప్రకాశ్ హుక్కేరి, చెన్నరాజ్ హట్టిహొళి తదితరులు ఉన్నారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీలో కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. భారీగా చేరిన కార్యకర్తలను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడుతూ అభివృద్ధితోపాటు ప్రతి ఇంటికి సంక్షేమం విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి అమలు చేస్తోందన్నారు. బీజేపీ దారి తప్పించేలా వ్యవహరిస్తోందని, ప్రజలు ఎవరూ విశ్వసించడం లేదన్నారు. హావేరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జీజీ ఆనందస్వామి గడ దేవరమఠ నామినేషన్ వేశారు. ధారవాడ లోక్‌సభ స్థానం నుంచి బీఎస్పీ తరపున శోభా బళ్లారి నామినేషన్ వేశారు. నామినేషన్లకు ముందు భారీ రోడ్‌షో, ఊరేగింపు నిర్వహించారు.

52మంది.. 69 నామినేషన్లు

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండో విడతలో సోమవారం నామినేషన్ల జోరు కొనసాగింది. 52మంది అభ్యర్థులు 69సెట్ల నామినేషన్లను సమర్పించారు. సోమవారం 14 నియోజకవర్గాలలోనూ నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా దావణగెరెలో 8మంది 9 నామినేషన్లు, హావేరిలో ఏడుగురు 9 నామినేషన్లు, ధార్వాడలో ఐదుగురు 11సెట్ల నామినేషన్లు వేశారు. బెళగావిలో నలుగురు 7 నామినేషన్లు, గుల్బర్గాలో నలుగురు 5 సెట్ల నామినేషన్లు వేశారు. మొత్తంగా 45మంది పురుషులు 59 నామినేషన్లు దాఖలు చేయగా ఏడుగురు మహిళలు 10 నామినేషన్ల సెట్లు వేశారు. ఇప్పటివరకు 88 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

దింగాలేశ్వరస్వామి సాహసం సరికాదు : యడియూరప్ప

కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి వ్యతిరేకంగా దింగాలేశ్వర స్వామి సాహసం చేయడం సరికాదని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. సోమవారం ప్రహ్లాద్‌జోషి నామినేషన్‌లో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏదో ఒక అంశాన్ని మనసులో పెట్టుకుని బరిలోకి దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఇప్పటికే దింగాలేశ్వరస్వామితో మాట్లాడానని, మరోసారి చర్చిస్తానని అన్నారు. ప్రహ్లాద్‌జోషి రెండు లక్షల మెజారిటీతో గెలుపొందుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన ఐదోసారి విజయఢంకా మోగిస్తారన్నారు. హుబ్బళ్లి-ధారవాడ జంటనగరాలకు ఎయిర్‌పోర్ట్ తీసుకొచ్చారన్నారు. అభివృద్ధి చేసేవారిని ప్రోత్సహించాలన్నారు.



హావేరిలో బీజేపీ అభ్యర్థి, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై..



బెళగావిలో కాంగ్రెస్ అభ్యర్థి మృణాల్ హెబ్బాళ్కర్..



కుమారస్వామికి వ్యతిరేకంగా బెంగళూరులో నిరసన చేపట్టిన కాంగ్రెస్ నేతలు

దుమారం రేపిన కుమార వ్యాఖ్యలు

- గ్యారెంటీలతో గ్రామీణ మహిళలు దారి తప్పుతున్నారంటూ నోరు జారిన వైనం
- ఆయన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- మహిళా కమిషన్ నోటీసులు
- బాధ కలిగి ఉంటే క్షమించండి : కుమారస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలతో గ్రామీణ మహిళలు దారి తప్పుతున్నారని మాజీ ముఖ్యమంత్రి, మండ్య లోక్‌సభ అభ్యర్థి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. శనివారం ఆయన ఎన్నికల ప్రచారం సందర్భంగా తుమకూరు రోడ్‌షోలో చేసిన ఈ వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు వ్యక్తమవయ్యాయి. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బెంగళూరు, మండ్యతోపాటు వివిధ ప్రాంతాల్లో కుమారస్వామికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. మండ్యలోని సంజయ్ సర్కిల్లో గోబ్యాక్ కుమారస్వామి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వివాదం కాస్త ఎన్నికలవేళ రాజకీయ కోణంలో మరింత తీవ్రమయింది. కొడగులో మాజీ ఎమ్మెల్సీ వీణా అచ్చయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి హోదాలో కొనసాగిన కుమారస్వామి మహిళలపట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రక్షణగా నిలిచిందన్నారు. మహిళల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ఆయన వ్యవహరించారని మండిపడ్డారు. వివాదం తీవ్రమవుతున్న తరుణంలో సోమవారం జేడీఎస్ కార్యాలయంలో కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. తాను మహిళలను కించపరచాలని మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2వేల గ్యారెంటీ పేరుతో ఇచ్చి ప్రతి కుటుంబంపై రూ.10వేల దాకా లూటీ చేస్తోందని మండిపడ్డారు. తన వ్యాఖ్యలు ఎవరినయినా బాధించి ఉంటే క్షమించాలని కోరారు. అయినా కుమారస్వామికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగాయి. కుమారస్వామి వ్యాఖ్యలపై మహిళా కమిషన్ స్పందించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసినట్టు కమిషన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మిచౌదరి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళల పట్ల దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో మహిళలకు బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు చేదోడుగా ఉండాలని, పదవులు పొందేవేళ, ప్రమాణ స్వీకారాల సందర్భంగా మహిళలకు గౌరవం ఇస్తామని హామీ ఇస్తారని, కానీ రాజకీయాల కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అన్నారు. కాగా బెళగావి బీజేపీ ఇన్‌చార్జ్ సంజయ్‌పాటిల్ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ గురించి పరోక్షంగా అక్క నియోజకవర్గంలో బీజేపీ సభకు భారీగా జనం వచ్చారని, అక్కకు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. స్లీపింగ్ మాత్రలు లేదా ఎక్స్‌ట్రా పెగ్ వేసుకోవాలని హేళన చేసేలా మాట్లాడారు. ఈ మేరకు కుమారస్వామితోపాటు సంజయ్‌పాటిల్‌కు నోటీసులు జారీ చేశారు. రెండువారాల్లో వివరణ ఇవ్వాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

మంత్రి జమీర్ అహ్మద్‌కు అస్వస్థత

- చాతి నొప్పితో ఆసుపత్రిలో చేరిక

బెంగళూరు/బళ్లారి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అమ్మద్ సోమవారం అస్వస్థతకు గురై చిత్రదుర్గం ఆసుపత్రిలో చేరారు. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప తరఫున ప్రచారం కోసం మంత్రి చిత్రదుర్గ వెళ్లారు. ముందుగా కార్యకర్తల సమావేశంలో పాల్గొని అనంతరం అక్కడ దగ్గరలో ఉండే ఒక ప్రాంతంలో ప్రచారం చేస్తున్నారు. ఈ సమయంలో ఆయన గుండె భాగంలో నొప్పి రావడంతో అక్కడే కూర్చుండి పోయారు. వెంటనే ఆయన్ను చిత్రదుర్గంలో ఉండే బసవేశ్వర ఆసుపత్రికి తరించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆయన్ను బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి నాగేంద్ర, బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం కుదుటుగా ఉందని వైద్యులు చెప్పినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.



ఆస్పత్రిలో మంత్రి జమీర్ అమ్మద్

రూ.2.93 కోట్ల నగదు స్వాధీనం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 15: సరైన రికార్డులు లేకుండా రూ.2.93 కోట్ల నగదును తరలిస్తుండడంతో హెబ్బగూడి పోలీసులు సీజ్ చేశారు. సోమవారం హెబ్బగూడి పోలీసులు గస్తీ తిరుగుతున్నవేళ సెక్యూరిటీ గార్డు లేకుండా సీఎంఎస్ ఏజెన్సీకి చెందిన వాహనంలో నగదు తరలిస్తుండాన్ని గుర్తించారు. ఈ మేరకు ఎన్నికల కమిషనర్, ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగదును స్వాధీనం చేసుకున్నట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీఐ రెడ్డి తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదు బాక్సులు

హస్తిన వైపు మాజీ సీఎంల చూపు

- జాతీయ రాజకీయాలపై ఆసక్తి
- లోక్‌సభ బరిలో కుమార, బొమ్మై, శెట్టర్



కుమారస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలంటే నిత్యం ఏదో ఒక పదవిలో కొనసాగాలని భావిస్తారు. కొందరు రాష్ట్ర రాజకీయాలకే పరిమితంగా ఉంటారు. మరికొందరు జాతీయ రాజకీయాలను వీడి ఇటువైపు వచ్చేందుకు ఆసక్తి చూపరు. కానీ ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు బరిలో ఉన్నారు. జేడీఎస్ పార్టీ నుంచి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కుమారస్వామి ప్రస్తుతం బీజేపీతో కొనసాగుతున్న పొత్తులో భాగంగా మండ్య నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి రాజకీయబరిలోకి వచ్చిన స్టార్ చంద్రు అభ్యర్థిగా ఉన్నారు. మరో మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ సొంత నియోజకవర్గం హుబ్బళ్లిని వీడి వియ్యంకురాలు మంగళా అంగడి ప్రాతినిధ్యం వహిస్తున్న బెళగావి నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్ రాజకీయంగా తొలి అడుగు వేశాడు. ఇక హావేరి నుంచి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై పోటీ చేస్తున్నారు. ఆయన ఏడాది క్రితం ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1952 నుంచి ఎంపీలుగా కొనసాగి ఆ తర్వాత ముఖ్యమంత్రులైనవారు ఉన్నారు. 1952లో ఎంపీగా వ్యవహరించిన నిజలింగప్ప, 1967లో జేహెచ్ పటేల్, 1968లో ఎస్ఎం కృష్ణ, 1980లో ధరంసింగ్, 1991లో దేవెగౌడ, 1996లో కుమారస్వామి, 2014లో డీవీ సదానందగౌడ ఎంపీ పదవులను వీడి ముఖ్యమంత్రులు అయ్యారు. తొలుత ముఖ్యమంత్రులుగా వ్యవహరించి ఆ తర్వాత ఎంపీలుగా కొనసాగినవారిలో 1957లో కేసీ రెడ్డి అయ్యారు. ఈయన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు 1962లో కెంగల్ హనుమంతయ్య సీఎంగా చేసి ఆ తర్వాత ఎంపీ అయ్యారు. దేశంలోనే చారిత్రాత్మకం అనిపించే విధానసౌధ నిర్మాణకర్త ఈయనే. 1980లో వీరేంద్రపాటిల్, 1989లో ఆర్. గుండూరావు, 2005లో బంగారప్ప, 2009లో వీరప్పమొయిలీ, 2014లో యడియూరప్ప ఎంపీలు అయ్యారు. 72ఏళ్ల రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రులుగా కొనసాగిన 23మందిలో 16మంది పార్లమెంటు సభ్యులుగా వ్యవహరించినవారే. వీరిలో 14మంది లోక్‌సభ సభ్యులుగాను, ఇద్దరు రాజ్యసభకు ఎంపికయ్యారు. పార్లమెంటుకు వెళ్లేందుకు సుముఖత చూపనివారిలో ఐదుగురు ప్రముఖులు ఉన్నారు. కడిదాళ్ మంజప్ప, బీడీ జత్తి, ఎస్ఆర్ కంఠి, దేవరాజ్ అరసు, సీఎం సిద్దరామయ్య ఉన్నారు. సిద్దరామయ్య రెండు సార్లు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినా గెలవలేదు.



బసవరాజ్ బొమ్మై



జగదీశ్ శెట్టర్

ధ్వజారోహణతో బెంగళూరు కరగకు శ్రీకారం

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక బెంగళూరు కరగ ఉత్సవానికి సోమవారం రాత్రి శ్రీకారం చుట్టారు. నగరత్ పేటలోని ధర్మరాయస్వామి ఆలయంలో ధ్వజారోహణ ద్వారా కరగ ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవం జరిగింది. మంగళవారం నుంచి 19వరకు ప్రతి రోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు, మంగళహారతులు కొనసాగనున్నాయి. 21న హసికరగ, 23న పౌర్ణమి సందర్భంగా కరగ శక్తి ఉత్సవం జరగనుంది. పూజారి జ్ఞానేంద్ర 13వసారి కరగను మోయనున్నారు. ఈ ఏడాది 3వేల మందికి పైగా వీరకుమారులు కరగ ఉత్సవంలో పాల్గొననున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పురాణాల ప్రకారం కురుక్షేత్ర యుద్ధం తర్వాత పాండవులు స్వర్గారోహణ వేళ ద్రౌపది స్పృహ కోల్పోతారు. ఈ విషయం పాండవులకు తెలియక ముందుకెళ్తారు. కొంత సమయం తర్వాత ద్రౌపది స్పృహలోకి రాగా తిమిరాసుర అనే రాక్షసుడు కనిపిస్తాడు. అప్పుడు ద్రౌపది ఆదిశక్తి రూపంలో తిమిరాసురుడిని సంహరించేందుకు తల, నుదురు, చెవులు, నోరు, భుజాల నుంచి వీరకుమారులను సృష్టిస్తారు. ఈ సైన్యం తిమిరాసురుడిపై పోరాడి సంహరిస్తారనేది పురాణ కథనం. అప్పటి నుంచి ద్రౌపదీదేవి రూపంలో కరగ ఉత్సవం జరుగుతుంది. ఈ సంప్రదాయం దేశంలో మరెక్కడా కనిపించదు.



ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి

కార్వార, బెళగావిని మహారాష్ట్రలో విలీనం చేయాలి

- ఎంఈఎస్ కార్యకర్తల డిమాండ్

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటక సరిహద్దు బెళగావి జిల్లాలో మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) కార్యకర్తలు మరోసారి వివాదాన్ని తెరపైకి తెచ్చారు. ఉత్తర కన్నడ జిల్లా జిల్లా కేంద్రం కార్వార, బెళగావి ప్రాంతాలను మహారాష్ట్రలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఏకీకరణ సమితి ఖానాపుర విభాగం తరపున ముఖ్యనాయకులు నిరంజన్ సర్దేశాయ్, రణజిత్‌పాటిల్‌తో ఉత్తరకన్నడ లోక్‌సభ స్థానానికి నామినేషన్లు వేశారు. సోమవారం ఉదయం కార్వారలో కార్యకర్తలు ర్యాలీ చేశారు. ఇదే సందర్భంగా కార్వార, నిప్పాణి, బెళగావిలను మహారాష్ట్రలో విలీనం చేయాలని, సమైక్య మహారాష్ట్ర కావాలని నినాదాలు చేశారు. మహారాష్ట్రలో చేరుతామని లేదంటే జైల్లో ఉంటామని పేర్కొన్నారు. గతంలో బెళగావి లోక్‌సభ స్థానం నుంచి ఎంఈఎస్ తరపున లోక్‌సభ, శాసనసభకు పోటీ చేశారు. ఉత్తరకన్నడ లోక్‌సభ స్థానం నుంచి తొలిసారి ఎంఈఎస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఖానాపుర పరిధి ఎంఈఎస్ కార్యాధ్యక్షుడు నిరంజన్ సర్దేశాయ్‌తోపాటు అదనంగా రణజిత్ పాటిల్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. నిరంజన్ సర్దేశాయ్ మాట్లాడుతూ కార్వార, బెళగావిలను ద్విభాషా ప్రాంతాలుగా ప్రకటించాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కన్నడ ప్రభుత్వాలు మరాఠీ భాష వాడరాదని డిమాండ్ చేస్తున్నాయని, కర్ణాటక ప్రభుత్వానికి మనసు లేదన్నారు. కార్వార, జోయిడా, హళియాళ ప్రాంతంలో వందలాది మరాఠీ పాఠశాలలు ఉండేవని వాటిని ప్రభుత్వం మూసివేయించిందన్నారు. మరాఠీ భాష పాఠశాలలకు కన్నడ ఉపాధ్యాయులను నియమిస్తున్నారని, తద్వారా మరాఠీ భాష మాట్లాడేవారికి అన్యాయం జరుగుతోందన్నారు. మరాఠీల హక్కుల రక్షణ సాధ్యం కావడం లేదన్నారు. ఇదే కారణంతోనే మరాఠీల హక్కులను ప్రజాస్వామ్యబద్ధంగా సాధించాలనే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ఎంఈఎస్ ఖానాపుర ముఖ్యులు గోపాల్ దేశాయ్, రమేశ్ దబాలె, బాలాసాహెబ్ శేలారా, గోపాల్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఎస్ కార్యకర్తల ర్యాలీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.88	1,577.09
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	162	262
సామర్థ్యం (టీఎంసీలు)	3.95	3.22

విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

పావగడ, ఏప్రిల్ 15: ఇష్టానుసారం విద్యుత్ కోతలు విధించడం, సరఫరా అయ్యే సమయంలోనూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగుకు అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందజేయాలని తాలూకా రైతు సంఘం ఆధ్వర్యంలో తాలూకా కేఈబీ కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేపట్టారు. వాణిజ్య పంట సాగుకు అవసరమైన విద్యుత్ అత్యవసరమై ఉండి రోజుకు రెండు, మూడుగంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని, అందులో లోడ్ సెట్టింగ్, లోటల్టేజీ, ఎల్‌సీ పేరిట కరెంటు తీస్తున్నారని మండిపడ్డారు. తీవ్రమైన ఎండలకు పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని తాలూకా రైతు సంఘం అధ్యక్షులు పూజారప్ప వాపోయారు. కోటగుడ్డం, శైలాపురం, పొన్న సముద్రం, ఎర్రంపల్లి ప్రాంతాల్లో టమోటా, కర్బూజా సాగు అధికంగా సాగు చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో కరెంట్ కోతల వల్ల పంటలు తీవ్ర నష్టానికి గురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు ఆరు గంటలైనా మూడు ఫేసుల విద్యుత్‌ను సరఫరా చేస్తే రైతులకు ఎంతో ఊరట కల్గుతుందన్నారు. మంగళవారం నుంచి విద్యుత్‌ను సక్రమంగా అందించకపోతే కేఈబీ కార్యాలయం ముందు ధర్నా చేపడ్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా వందలాది మందిరైతులు కేఈబీ కార్యాలయానికి చేరుకొని కేఈఓ అధికారి కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.



విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

ఓటు హక్కుపై అవగాహన



ర్యాలీలో కార్పొరేషన్ సిబ్బంది

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15: అర్హులైన ఓటర్లందరూ ప్రజాస్వామ్య ఎన్నికల హోదాను కలిగి ఉన్నారని, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని మహానగర కార్పోరేషన్ ప్లానింగ్ మేనేజర్ దేవరాజు సూచించారు. సోమవారం బళ్లారి పరిధిలోని వార్డు నంబరు 19. కన్నడ నగర్‌లోని మహానంది కొట్టం, గణేశ్ కాలనీ, రాయల్ కాలనీ, సిద్ధార్థకాలనీ, నిజలింగప్ప కాలనీల్లో ఓటరు అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా 18 ఏళ్లునిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో డబ్బులకు లొంగకుండా, నైతికంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నామని, ఈసారి ఓటింగ్ శాతాన్ని పెం చడమే లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాలంటే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. వ్యర్థాలను సేకరించే వాహనాల్లోనూ ఓటింగ్‌పై అవగాహన కల్పించే పాటలను ప్రసారం చేస్తున్నామన్నారు. మహానగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ గురురాజ్ సవాడి, మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు కిరణ్, హర్షవర్ధన్, రెవిన్యూ, టెక్నికల్, హెల్త్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంప్లి, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఓటుహక్కుపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని సత్య నారాయణ పేట ప్రభుత్వ పాఠశాలలో జాగృతి కార్యక్రమం తాలుకా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో అమూల్య, తనూశ్రీ, ప్రణతి ప్రథమస్థానం దక్కించుకున్నారు. ద్వితీయ స్థానం లిఖిత, ప్రియ, శ్రీదేవి, రమేష్‌లు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా తాలుకా ఈఓ శ్రీకుమార్ మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహక కల్పించేందుకు డ్రాయింగ్ పోటీలను చేపట్టామన్నారు. ఓటు హక్కు పొందిన వారు మే 7న ఓటువేసి, హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో పాటు ఏడీ మల్లన్న గౌడ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి

● ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం డిమాండ్



నిరసనలో ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం సభ్యులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15: జిల్లాలోని కోలూరు గ్రామంలో నరేగా పథకంలో పనిచేసిన కూలీలకు తక్కువ వేతనాలు ఇవ్వడం పట్ల ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం మంగళ వారం నిరసన చేపట్టింది. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లాధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.349 అందాయని, అయితే కూలీలకు సరైన సొమ్ము చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సొమ్ము చెల్లించి మోసం చేస్తున్నారన్నారు. పనులు చేపట్టే స్థలాల్లో ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, కూలీలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎండల కారణంగా కూలీలు అనారోగ్యానికి గురవుతు న్నారని, అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాఉపాధ్యక్షుడు బసన్న మాట్లాడుతూ కార్మికులందరికీ పూర్తి వేతనాలు రూ.349 వెంటనే ఇవ్వాలని, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పనివేళలు మార్చాలని, పని చేసే చోట తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కార్యదర్శి గురల్లిరాజా, రైతులు రవిచంద్ర, వీరేశ్, దొడ్డబసప్ప, రెహమాన్, రాజశేఖర్, శేఖర్, తిప్పేస్వామి, గాదిలింగ ,రాజమ్మ, మల్లమ్మ, శివమ్మ, గురుశేఖర్, నింగమ్మ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక



దరోజీ పంచాయతీ సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీరాములు

కంప్లి, ఏప్రిల్ 15: పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. సండూరు తాలుకా పరిధిలోని కొత్త దరోజీ గ్రామ పంచాయతీకి చెందిన తిమ్మప్ప, షణ్ముఖ, నాగరాజు, స్వామి తదితరులు సిద్దేష్ ఉప్పర్, హనుమేష్ ఉప్పర్ నేతృత్వంలో సోమవారం బీజేపీలో చేరారు. బళ్లారిలో మాజీ మంత్రి శ్రీరాములు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతోనే బీజేపీలో చేరామన్నారు. వారితో పాటు రాజా, ఈరణ్ణ, నాగమూర్తి, నాగరాజ, నాగన్న, గణేష్, సిద్దేష్, హనుమేష్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మామా అల్లుళ్ల ప్రచారం

నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు జోరుగా ప్రచారం చేపట్టారు. బాదనట్టి, కలకంబ్ల, ఎమ్మిగనూరు, నెల్లూడి, తదితర గ్రామాల్లో విస్తృతంగా మామఅల్లుళ్లు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని, మోదీ చేపట్టిన, యడియూరప్ప చేపట్టిన అభివృద్ధి పథకాలు, పనులు ఎన్నో వున్నాయని, ఆ పథకాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకు దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు.

కాలువలో పడిన పోలీస్ వాహనం

రాయచూరు, ఏప్రిల్ 15: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వెంబడిస్తూ పోలీసు వాహనం ప్రమాదానికి గురయ్యింది. సోమవారం సింధనూరు తాలూకాలోని రైతునగర్ క్యాంప్ సమీపంలో ఇసుక ట్రాక్టర్‌తో అక్రమ రవాణ చేస్తున్నారని సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ పారిపోవడానికి ప్రయత్నించాడు. ట్రాక్టర్‌ను వెంబడించిన పోలీసులు ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో పోలీసు వాహనం సహా కాల్వలో పడ్డారు. ఈ సంఘటనలో డ్రైవర్, మరో పోలీస్ కానిస్టేబుల్‌కు గాయాలు అయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు జేసీబీ సహాయంతో పోలీస్ వాహనాన్ని కాల్వ పై నుంచి పైకి తీశారు.



ధ్వంసమైన పోలీసు వాహనం

కుమారస్వామి వ్యాఖ్యలపై నిరసన



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాయచూరు, ఏప్రిల్ 15 : మాజీ సీఎం కుమారస్వామి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. నిరసనలో మంత్రి ఎన్ఎస్ భోసరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ గ్యారెంటీలను కుమారస్వామి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. శక్తి పథకాన్ని (మహిళలకు బస్ ఫ్రీ) మహిళలు దుర్వినియోగం చేస్తున్నారనీ, తద్వారా వారు తప్పుదారి పడుతున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు మూర్ఖత్వంతో కూడినవన్నారు. మహిళల పట్ల చులకన వ్యాఖ్యలు చేసిన కుమారస్వామి వెంటనే వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుమార వ్యాఖ్యలపై సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్‌తో మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న బీజేపీ ఈ విషయంలో స్పందించాలన్నారు. నేరుగా ప్రధానమంత్రి కుమారస్వామి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని దీనిపై స్పందించాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి 'స్పీకథాన్' పోటీలు



నోడల్ అధికారి రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా పాలనా యంత్రాంగం, జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 'స్పీకథాన్' పోటీలను నిర్వహించనున్నట్లు నోడల్ అధికారిగా ఉన్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ శరణప్ప పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన జిల్లా పంచాయతీ హాల్లో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఓటింగ్ శాతాన్ని పెంచడమే ధ్యేయమన్నారు. ఇప్పటికే 30 ఏళ్ళ లోపు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి కన్నడ, ఆంగ్ల భాషల్లో తాలూకాస్థాయి 'స్పీకథాన్' పోటీలు నిర్వహించామని, తాలూ కా స్థాయి విజేతలకు ఇప్పుడు జిల్లాస్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల ప్రజలు ఉచితంగా వచ్చి పోటీని వీక్షించవచ్చని తెలిపారు.

ఘనంగా చేతన్‌షా వలీ దర్గా ఉరుసు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మత పెద్దలు

సిరుగుప్ప, ఏప్రిల్ 15 : చేతన్‌షా వలీ తాత ఉరుసు మహోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. సిరుగుప్ప పట్టణంలో 3వ వార్డులో వెలసియున్న చేతన్‌షావలీ గంధం ఉరుసు జియారత్ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ముస్లిం గురువులు అబ్దుల్ సమద్ నిజామీ తాత దర్గాకు పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మహమ్మద్ వలీ, అబ్దుల్ నబీ, డబుల్ బాండ్, అండీ హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'దరగెదొడ్డవరు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15: కవులు, రచయితలు, కథకులు తాము చూపిన వాటిపై ఊహాశక్తిని ఏర్పరచుకుని సాహిత్యాన్ని అల్లుతారు. కానీ భువనేశ్వర్ కుమ్మరి కథల సంపుటిగా పేరుపొందిన దరగెదొడ్డవరు రచనలో వాస్తవాలన్నీ తెలిపారని సాహితీవేత్త వీర్ భాషా పేర్కొన్నారు. ఆదివారం రాఘవ కళామందిరంలో మోకా సర్వజ్ఞ ప్రకాశన్, బళ్లారి జిల్లా కుమ్మరుల సంఘం, ఆలాప్ సంగీత ఆర్ట్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన లోహియా ప్రకాశన్ ప్రచురణకర్త చన్నబసప్ప మాట్లాడుతూ కపటత్వం లేని, అమాయకపు మనసు కలిగి ఉన్న భువనేశ్వర్ వ్యాపారంతోపాటు డబ్బు సంపాదించకుండానే అశేష ప్రేక్షకులను, సాహితీవేత్తలను సంపాందించుకున్నారన్నారు. అశేష అభిమానులను కలిగి ఉన్న కథకుడు మోకా కుంబార్ భువనేశ్వర్‌ను సాహితీ మిత్రులు సత్కరించారు. ఈసందర్భంగా సంగీత ఉపాధ్యాయుడు దొడ్డా బసవ గవాయి, విద్యార్థులు సంగీతాన్ని ఆలపించారు. రమణప్ప భజంత్రీ, కుమ్మరుల సంఘం కార్యదర్శి, సిద్దలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న రైతు మోర్చా నాయకుడు గుర్లింగనగౌడ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 15 : తాలుకాలోని బొబ్బుకుంట, ఎత్తిన బూదేహాళ్, సంజీవరాయుని కోటతోపాటు పలు గ్రామాల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం చేపట్టింది. సోమవారం బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు ఓటు వేసి గెలిపించాలని రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుర్లింగనగౌడ గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. మహిళలకు, యువకులకు వినూత్న పథకాలతో కేంద్రం అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, మరోసారి మోదీ ప్రధాని అయితేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న పొలాలపై ఎలుగుబంట్ల దాడి



ఉప్పరహళ్లి-ధర్మసాగర్ మార్గంలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

కంప్లి, ఏప్రిల్ 15 : తాలుకా పరిధిలోని దేవసముద్రం, మెట్రి, దేవలాపురం, ఉప్పరహళ్లి, తదితర కొండ ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలపై ఎలుగుబంట్లు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. కొండల్లో, గుట్టల్లో, అటవీ ప్రాంతాల్లో ఆహారం లేకపోవడంతో కొండ చుట్టూ వుండే ప్రాంతాల్లో పంటలపై పడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు కొండ ప్రాంతాల చుట్టూ వుండే ఎలుగుబంట్లు తిరుగు ప్రాంతాల్లో కంచె ఏర్పాటు చేసి కొంత వరకు దాడి చేయకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, ఏప్రిల్ 15 : దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ సారి పగ్గాలు చేపట్టడంలో ఎలాంటి అనుమానం లేదని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో మహిళా శక్తి వందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ హేమలత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు మాట్లాడుతూ పదేళ్లలో మోదీ దేశ భవిష్యత్తు కోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించారన్నారు. ఎమ్మెల్సీ హేమలత బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు ధరప్ప నాయక, బసవరాజు, మధుసూదన్‌శెట్టి, కొప్పాళ మహిళా అధ్యక్షురాలు రత్నకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

హోసూరు జోన్

వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

హోసూరు(కృష్ణగిరి), ఏప్రిల్ 15: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. బర్గూరు కాంకోర్డియా అంధుల హోసూరు బధిరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ తరుపున ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కేఎం సరయు నేతృత్వంలో ప్రతిజ్ఞ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్లకార్డులతో దివ్యాంగులు పాల్గొన్నారు. ఈనెల 19న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని 6 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా జిల్లాలో మొత్తం 14,440 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. అలాగే పోలింగ్‌బూత్‌లకు నేరుగా రాలేని వారికి పోస్టల్ ఓటు సదుపాయం కల్పించారు. 640 మంది దివ్యాంగులు పోస్టు ద్వారా ఓటు వేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు వీలుగా వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. అలాగే అంధుల కోసం అభ్యర్థుల పేరు, చిహ్నం, క్రమ సంఖ్య వారు బ్రెయిలీలో ముద్రించిన నమూనా ప్యాలెట్ షీట్‌పై అవగాహన కల్పించారు. బధిరుల కోసం అంబూర్ డెఫ్ స్పెషల్ పాఠశాల ఉపాధ్యాయులు సంకేత భాషలో 100 శాతం ఓటింగ్ యొక్క ప్రాముఖ్యతను ప్రదర్శించారు. ఓటు వేయడం ద్వారా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండ్ తంగదురై, ఏడీఎల్ కలెక్టర్ వందనా కార్గే, కృష్ణగిరి రెవెన్యూ కమిషనర్ సహాయ ఎన్నికల అధికారి సీబాబు, దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేషన్, స్పెషల్ టీచర్స్, డెఫ్ అండ్ డంబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పరిశీలన

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 15: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఇందుకు అవసరమయ్యే ఈవీఎంలు, వీవీప్యాట్‌లు భద్రతపై ఎన్నికల అబ్జర్వర్ కిరణ్‌కుమార్తి భాసిని పరిశీలించారు. హోసూరు అసెం బ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో భద్రంగా నియోజకవర్గానికి సంబంధించి 461 బ్యాలెట్ మెషిన్లు, 499 వీవీప్యాట్ యంత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రియాంక రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో కళాశాలలో భద్రంగా ఉంచిన యంత్రాలను హోసూరు ఆర్ట్స్ కళాశాల సెక్యూరిటీ గదిలో తాళం వేసి సీల్ చేశారు. హోసూ రు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు వేయడానికి ఉపయోగించే ఫారమ్‌లు, ఇతర స్టేషనరీని పరిశీలించారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న అబ్జర్వర్ కిరణ్ మూర్తి

కార్మికుడిపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

హోసూరు(క్రైం), ఏప్రిల్ 15: హోసూరు మత్తిగిరి సమీపంలో ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని కత్తితో పొడిచిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఆరుగురికి కోసం గాలింపులు చేపట్టారు. హోసూరు తాలూకా ఒన్నపల్లికి చెందిన మునిరాజ్, ఇతని కుమారుడు సతీష్‌కుమార్(23) పూనపల్లి ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనితో పాటు మదురై జిల్లా సాలిపుత్తూరు ప్రాంతానికి చెందిన అజిత్ కుమార్ (27) కూడా కంపెనీ ప్యాకేజీ విభాగంలో పనిచేస్తున్నాడు. అజిత్ కుమార్, అతని స్నేహితులు బేలగొండపల్లి ప్రాంతంల్లో ఉంటున్నారు. 12వ తేదీన సతీష్, అజీత్‌కుమార్‌లకు కంపెనీ ఆవరణలో వాగ్వాదం చోటుచేసుకుంది. అజీజిత్ కుమార్ బయట ఉన్న తన స్నేహితులకు ఫోన్ చేశాడు. అనంతరం అజిత్‌కుమార్ స్నేహితులు కొందరు ఆయుధాలతో కంపెనీ ప్రాంగణానికి వచ్చారు. అక్కడ సతీష్ కుమార్ పై దాడి చేసి కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడిన సతీశ్‌కుమార్‌ను సమీపంలో వారు రక్షించి చికిత్స నిమిత్తం హోసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కుమార్ తండ్రి మునిరాజ్ మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని మదురై శాలిపుత్తూరుకు చెందిన అజిత్‌కుమార్ (27), మదురై పెత్తనపురానికి చెందిన సచిన్ (19),మత్తిగిరి బేలగొండపల్లి కి చెందిన సునీల్‌కుమార్ (26), తిరుపత్తూరు మావత్తం నాట్రాంపల్లి అజీత్‌కుమార్(24), మదురై విలువంకుడి అజయ్ (22) , బొమ్మంబడపల్లి వినయ్(24) మదురై ముత్తురామలింగ్ దేవర్ స్ట్రీట్ అరుణ్‌పాండి (32), మదురై తులాలమూడి వీరపాండికుమార్ (20), కడలూరు జిల్లా విరుదాచలం ప్రకాశ్‌రాజ్ (24) అని 9 మందిపై కేసు పెట్టారు. పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. వీరిలో అరుణ్‌పాండి, వీరపాండికుమార్, ప్రకాశ్ అనే ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జైల్లో పెట్టారు. మరో 6 మంది కోసం గాలిస్తున్నారు.



← కేసీసీ నగర్‌లో ఓ ఇంటి వద్ద ఇలా..

సంచలనం రేపుతున్న 'నో వాటర్.. నో ఓట్'

హోసూరు, ఏప్రిల్ 15: ఓటు హక్కుపై ఎంతగా అవగాహన కల్పిస్తున్నా మౌలిక సదుపాయాలైన కనీస తాగునీరు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దీంతో నీరు లేని కారణంగా 'నో వాటర్ నో ఓట్' అంటూ ఇంటి ముందు ప్రకటించడంపై సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. బాగలూరు రోడ్డులోని కేసీసీ నగర్ లో 1200కు పైగా కుటుంబాలు ఉన్నాయి. 15 ఏళ్ల క్రితం అపార్ట్‌మెంట్లు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్పొరేషన్ తాగునీటి కనెక్షన్ ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమయ్యేంతవరకు ఓటు వేసేది లేదని కొందరు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

బాగలూరు రథోత్సవంలో కరగ సందడి

హోసూరు ఏప్రిల్ 15: హోసూరు సమీపంలో బాగలూరు గ్రామంల్లో 500 ఏళ్ల నాటి గ్రామ దేవత కోటమారియమ్మ ఆలయం ఏటా ఉగాది రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బాగలూరు ఉత్సవాల్లో మొదటి రోజున రథోత్సవం, తర్వాత పల్లకీలు, తదనంతరం కగరం ఇలా అమ్మవారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకరణతో ఊరేగింపుగా తీసుకొస్తారు. ఇందులో భాగంగా ఘనంగా ద్రౌపది కరగ ఉత్సవం జరిగింది. 48 కిలోల బరువైన కరగను మోస్తూ నృత్యం చేశారు. నిరంతరం ఉదయం 10 గంటల వరకు గాగలూరులోని ప్రధాన వీధుల్లో సూడాపురం తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. బాగలూరు, బేరికై, హోసూరు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



కరగ ధరించి నృత్యం చేస్తున్న పూజారి

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కందుకూరి వీరేశలింగం పంతులు (జయంతి)




సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. రచయితగా, ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించారు. స్త్రీ విద్యకోసం విశేష కృషి చేశారు. యువజన సంఘాల స్థాపన ఆయనతోనే మొదలైంది. హితకారిణి అనే ధర్మసంస్థను స్థాపించి తన యావదాస్తిని ఇచ్చేశాడు. మూడు దశాబ్దాలపాటు తెలుగు పండితుడిగా పనిచేశారు. 130కు పైగా గ్రంథాలు రాశారు. అనేక ఆంగ్ల, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆధునిక తెలుగు నాటక రంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, ప్రదర్శనకారుడైన ఆయన పుట్టినరోజును తెలుగునాటక రంగ దినోత్సవంగా నిర్ణయించారు. రావు బహద్దూర్ బిరుదు పొందారు. 1919 మే 27న కన్నుమూశారు.

చార్లీ చాప్లిన్ (జయంతి)



చార్లీచాప్లిన్ 1889 ఏప్రిల్ 16న ఇంగ్లండ్ దేశంలో జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరూ వృత్తి రీత్యా నటులు. మూడేళ్ల వయసులోనే మిమిక్రీలో ప్రతిభ చాటాడు. అనేక కళల్లో నిష్ణాతుడైన ఒక ప్రసిద్ధ బహురూపి, అమాయకుడిలా తెరమీద కనిపించే చాప్లిన్, నిజానికి చాలా చక్కనివాడు, అందగాడు, ఆశ్చర్యాన్ని గొలిపే రచయిత. చక్కటి గాయకుడు. యుద్ధాన్ని నిరంతరం విమర్శించే శాంతిప్రియుడు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ అద్భుతాల్లో ఒకడు. మూకీ సినిమాల చక్రవర్తిగా అభివర్ణించబడ్డారు. ఆయన వేషధారణ విచిత్రంగా ఉంటూ అందరినీ ఆకట్టుకునేది. 1910-30 దశకాలలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటుడు. 1977 డిసెంబరు 25న కన్నుమూశారు.

బిరుదురాజు రామరాజు (జయంతి)



జానపద సాహిత్యంపై విశేష కృషి చేసిన రచయిత బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16న హనుమకొండ జిల్లా దేవనూరు గ్రామంలో జన్మించారు. యువ నాయకులతో కలసి రజాకార్ల ఉద్యమం, స్టేట్‌కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొని 1947లో మూడు నెలలపాటు కారాగారశిక్ష అనుభవించారు. ఆంధ్ర రచయితల సంఘానికి తొలి కార్యదర్శి. దక్షిణభారతదేశంలోనే జానపద సాహిత్యంపై మొట్టమొదటి పీహెచ్‌డీ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు. అంచెలంచెలుగా తెలుగుశాఖ డీన్‌గా, అధ్యక్షుడిగా ఎదిగారు. గౌరవ డాక్టరేట్ సహా రాజాలక్ష్మి పురస్కారం, సీపీ బ్రౌన్ అకాడమీవారి తెలుగుభారతి పురస్కారం అందుకున్నారు. ఆయన మార్గదర్శకంలో 37మంది పీహెచ్‌డీ పొందారు. 2010 ఫిబ్రవరి 8న కన్నుమూశారు.

పోప్ బెనెడిక్ట్ (జయంతి)



పోప్ బెనెడిక్ట్-16 1927 ఏప్రిల్ 16న జర్మనీదేశంలో జన్మించారు. క్యాథలిక్ చర్చ్ హెడ్‌గా వ్యవహరించారు. వ్యాటికన్ సిటీ కేంద్రంగా క్రైస్తమతబోధకుడిగా పేరొందారు. డీన్ ఆఫ్ ది కాలేజ్ ఆఫ్ ఆర్డినల్స్, ప్రెసిడెంట్ ఆఫ్ ది పొంటిఫికల్ బిబ్లికల్ కమిషన్, ఆర్చ్ బిషప్ ఆఫ్ మ్యూనిడ్ అండ్ ఫ్రిజింగ్ తదితర హోదాలలో కొన సాగారు. 66 పుస్తకాలు, ఇతర రచనలు చేశారు. 2022 డిసెంబరు 31న కన్నుమూశారు.

ఎంఎస్ నారాయణ (జయంతి)



ప్రముఖ తెలుగు హాస్యనటుడు, దర్శకుడు, రచయిత మైలవరపు సూర్య (ఎంఎస్) నారాయణ 1947 ఏప్రిల్ 16న పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రులో జన్మించారు. చదువుకునే రోజుల నుంచే హాస్య రచనలు చేసే వారు. కొన్ని నాటకాలు రాశారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టి వద్ద కొంతకాలం రచయితగా పనిచేశారు. 'మా నాన్నకి పెళ్ళి' సినిమాలో తాగుబోతు పాత్ర గుర్తింపు తెచ్చింది. ఉత్తమ కమెడియన్‌గా 5 నంది అవార్డులు అందుకున్నారు. తర్వాత కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనారోగ్యంతో 2015 జనవరి 23న హైదరాబాద్‌లో కన్నుమూశారు.

ఎస్. సౌమ్య (పుట్టినరోజు)



ఎస్. సౌమ్య 1969 ఏప్రిల్ 16న జన్మించారు. కర్ణాటక సంగీత గాయని. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో మూడు దశాబ్దాలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత కళానిధి, సంగీత చూడామణి, సంగీత కళా సారథి, విద్యా తపస్వి, సంగీత రత్నాకర తదితర అవార్డులు అందుకున్నారు. తమిళనాడులోని జయలలిత మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు.

వేసవి సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 15: చిక్కబళ్ళాపుర జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ పీఎం పోషణ శక్తినిర్మాణ పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు జిల్లా అక్షర దాసోహ విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. శిడ్లఘట్ట తాలూకాలోని సుగటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11నుంచి మే 28వరకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు. ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకించి కరువు పీడిత తాలూకాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఒకటో తరగతినుంచి పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో ఒకటికంటే ఎక్కువ పాఠశాలలు ఉంటే అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చామన్నారు. కాగా మధ్యాహ్న భోజనం పొందేందుకు సంబంధించి తల్లిదండ్రులనుంచి అనుమతిపత్రం పొందాల్సి ఉంటుందని సూచించారు. తద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంట చేసేందుకు వీలవుతుందన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాలో 1,352 కేంద్రాలలో మధ్యాహ్న భోజనం పంపిణీ కేంద్రాలను గుర్తించామని, 67,699 విద్యార్థులు అంగీకారపత్రం సమర్పించారన్నారు. విద్యార్థులు వేరే గ్రామంలో ఉన్నా స్థానిక ఉపాధ్యాయుడి అనుమతితో మధ్యాహ్న భోజనం పొందే వెసలుబాటు ఉందన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇందుకు సరిపడా ఆహారధాన్యాలను ఇప్పటికే సరఫరా చేశామన్నారు. ప్రభుత్వ ఇతర ఖర్చులకు సంబంధించి ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు కొంత నగదు జమ చేశామన్నారు. వంట సిబ్బంది నియామకం, భోజన పంపిణీ అంశం ఆయా పాఠశాల కళాశాలలు, ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించామన్నారు. జిల్లాలో 1352మంది బాధ్యత వహిస్తున్నారన్నారు. 1979మంది వంటసిబ్బందిని నియమించుకున్నట్టు తెలిపారు. 250మందికంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న కేంద్రాలకోసం 48మంది నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రతిరోజూ వీరు పాఠశాలలను సందర్శించి పరిశీలిస్తారన్నారు. పిల్లల హాజరు, ఆహార రుచి, నాణ్యత, సౌలభ్యాలను పర్యవేక్షిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రుద్రేశ్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న పిల్లలు

గ్రంథాలయ గోడ రాతపై సర్వత్రా విమర్శలు

▸▸ ఒక మందిరం నిర్మిస్తే వెయ్యిమంది బిచ్చగాళ్లు పుడతారంటూ రాతలు

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ రెసిడెన్షియల్ పాఠశాల ప్రధాన ద్వారం వద్ద జ్ఞానాన్ని బోధించే ఆలయమిది చేతులు జోడించి లోపలికి రండి అనే నినాదాన్ని 'జ్ఞానాన్ని బోధించే ఆలయమిది ధైర్యంగా ప్రశ్నించండి' అనేలా మార్పు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీయడంతో తొలిగించిన విషయం మరువక ముందే మరోసారి అటువంటి వివాదమే తలెత్తింది. చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేనహళ్ళి గ్రామ పంచాయతీ గ్రంథాలయం గోడపై వివాదాస్పదం అనిపించే నినాదం సోమవారం వెలుగులోకి వచ్చింది ఒక మందిరం కడితే వేయిమంది బిక్షకులు పుట్టుకొస్తారని అదే ఒక గ్రంథాలయం ఏర్పాటు చేస్తే లక్షలాది మంది మేధావులు పుట్టుకొస్తారని రాశారు. గోడరాతపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మందిరంకు బదులుగా మసీదు అని ఎందుకు నమోదు చేయలేదని హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హిందువుల పట్ల, హిందువులు ఆరాధించే వారి పట్ల అనుచితంగా మాట్లాడే విధానం తీవ్రమవుతోందని మండిపడ్డారు. సదరు గ్రంథాలయం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ పరిధికి చెందినది. గ్రంథాలయం గోడపై రాతలను వెంటనే మార్పు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హిందూ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు.

తగ్గిన ప్రధాని మోదీ హవా : ఎమ్మెల్యే



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, ఏప్రిల్ 15: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ గత పదేళ్ల పాలనలో ఎటువంటి హామీలు నెరవేరలేదని ఈ కారణంగా మోదీ హవా తగ్గిందని రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయ పడ్డారు. సోమవారం తాలూకాలో కామసముద్ర పరిధిలో కార్యకర్తల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్, ఐఎన్‌డీఐఏ కూటమి సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రానుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలు, రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని కేవలం కార్పొరేట్ రంగాలకే పరిమితమయ్యారన్నారు. కాంగ్రెస్‌లో ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవన్నారు. మైనారిటీల ఓట్లు క్రోడీకరించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఓటర్లను దారి తప్పించేలా కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్‌ను సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌వాసిగా ప్రతిపక్షాలు ప్రతిబింబించేలా చేస్తున్నాయన్నారు. వాస్తవానికి కేవీ గౌతమ్ తండ్రి బెంగళూరులో మేయర్‌గా వ్యవహరించారన్నారు. గౌతమ్ పుట్టుక, విద్యాభ్యాసం బెంగళూరులోనే సాగిందన్నారు. ఆయన తల్లి చింతామణి ప్రాంతవాసియేనన్నారు. గౌతమ్ సోదరి వివాహం కోలారు ప్రాంత వాసితో జరిగిందన్నారు. ఇలా గౌతమ్‌కు కోలారుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. బీఈ చదివిన, ఉత్తమ వ్యక్తిత్వం కల్గిన కేవీ గౌతమ్‌ను గెలిపించాలన్నారు. కాగా బీజేపీ, జేడీఎస్ మైత్రి అభ్యర్థి మల్లేశ్‌బాబు కూడా కోలారు వాసి కాదని బెంగళూరుకు చెందినవారన్నారు. ఆయన తల్లి కోలారులో ఉంటున్నారన్నారు.

ఏనుగు దాడి మృతులకు పరిహారం

తాలూకాలోని బోనహళ్ళిలో ఏనుగు దాడిలో నారాయణప్ప మృతి చెందారని అధికారులతో చర్చించి అతడి కుటుంబానికి త్వరలోనే పరిహారం అందేలా చూస్తానన్నారు. గతంలో కాంగ్రెస్‌లో అధికారంలో ఉన్నవేళ సోలారు కంచెకు అవకాశం చొరవ చూపామన్నారు. 70శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బీజేపీ గ్రాంట్లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రెతో చర్చించనున్నట్టు తెలిపారు. ఎన్నికలయ్యాక పనులు పూర్తి చేస్తామన్నారు. మీడియా సమావేశంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆదినారాయణ కుట్టి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజు, ప్రముఖులు పిచ్చహళ్ళి గోవిందరాజు, సమాజసేవకుడు మునిరాజు, రంగాచారి, జీఎం శ్రీనివాస్, బాబు, మునీర్, సీతారామప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగుమీడియం పాఠశాలల్లో చదివిన పూర్వవిద్యార్థులంతా చేరి అంబేడ్కర్ జయంతిని అర్థవంతంగా నిర్వహించారు. పి.వి. తిరుపతి (రిటైర్డు శాస్త్రవేత్త), వై దాసు, మాతరాజు, శ్రీధర్ (రిటైర్డు అసిస్టెంట్ కమిషనర్, సెంట్రల్ ఎక్సైజ్), సుబ్రమణి, డేవిడ్ రాజుల ఆధ్వర్యంలో హోసూరు ట్యాంక్‌బండ్ రోడ్డులోని యాదవ సంఘంలో నిర్వహించారు. ఐటీఐ రిటైర్డు అధికారి వల్లూరు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కెనరాబ్యాంకు రిటైర్డు అధికారి కేశవులు, నరసింహులు, డాక్టర్ రత్నం, తెలుగు ఉపాధ్యాయుడు కేశవ్ అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అతిథులు తమ ప్రసంగంలో దేశంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికోసం అంబేడ్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా హలసూరు మర్ఫీటౌన్, శివాజినగర్ తెలుగు పాఠశాలలో చదివిన విద్యార్థిని వి.పల్లవి పీయూ ద్వితీయ ఫలితాల్లో రాజధాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో టాపర్‌గా నిలవడంపై ప్రత్యేకంగా సత్కరించారు. ప్రత్యేకంగా విద్యార్థిని సన్మానించి భవిష్యత్తులో మరింత రాణించాలని ప్రోత్సహించారు.



విద్యార్థినికి సత్కారం

క్యాన్సర్‌ను జయించినవారికి మణిపాల్ ఆధ్వర్యంలో ఐపీఎల్ వీక్షణ

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కి అధికారిక ఆరోగ్య పార్ట్‌నర్ మణిపాల్ ఆసుపత్రులు వినూత్నంగా ఓ కార్యక్రమం జరిపారు. సోమవారం ఆర్‌సీబీ జట్టు పాల్గొన్న ఐపీఎల్ మ్యాచ్‌కు కేన్సర్‌ను జయించిన 20మందిని చిన్న స్వామి స్టేడియంకు తీసుకొచ్చారు. కేన్సర్ అంటేనే భయమని ఇలా కొన్ని నెలలపాటు అనారోగ్యంతో ఇబ్బందిపడి ధైర్యంతో ఆరోగ్యవంతులైన బాధితులలో సంతోషం నింపాలనే ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ క్రికెట్‌మ్యాచ్‌కు తీసుకొచ్చారు. మ్యాచ్‌ను వారు ఎంతో సంతోషంగా వీక్షించి సరదాగా గడిపారు.



స్టేడియంలో వీక్షిస్తూ ఇలా...

పేదల కడుపు మాడ్చిన జగన్

- అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపునింపిన టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేత

ధర్మవరం, ఏప్రిల్ 15: తెలుగుదేశం హయాంలో పేదల కడుపునింపేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని లేకుండా చేసింది. 2018లో పేదల ఆకలి తీర్చాలన్న ఆలోచనతో ఉమ్మడి జిల్లాలో 14 అన్నక్యాంటీన్లను అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేశారు. హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి, ధర్మవరంలో 2 అన్న క్యాంటీన్లు నిర్మించారు. ధర్మవరంలో ప్రభుత్వాస్పత్రి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేసింది. వాటిలో రోజుకు 3వేల మంది దాకా భోజనం, అల్పాహారం చేస్తుండేవారు. పట్టుకేంద్రమైన ధర్మవరానికి రోజూ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ హోటళ్లలో టిఫిన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.60కిపైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవి. తక్కువ ధరకే టిఫిన్, భోజనం లభిస్తుండేది. దీంతో పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు భోజన ఇబ్బందులు తప్పేవి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రూ.5కే టిఫిన్, భోజనం లభించేది. అన్న క్యాంటీన్‌లో టిఫిన్ ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరీ, భోజనంలో అన్నం, పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు ఇచ్చేవారు. ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు టిఫిన్, మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు భోజనం, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు అన్న క్యాంటీన్ తెరిచి ఉండేది. దీంతో కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకోకపోతే అన్న క్యాంటీన్‌లో చేసేవారు. రోజుకు ఒక్కో క్యాంటీన్‌లో అల్పాహారం 350, మధ్యాహ్నం, రాత్రి భోజనం 900 మందికి అందించేవారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్ దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసివేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో సచివాలయాలుగా మార్చేశారు.

65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత ప్రయాణం

▸▸ ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 65ఏళ్లు పైబడిన పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం తీసుకొస్తామని సీఎం ఆర్థిక సలహాదారుడు, ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి అభిప్రాయపడ్డారు. కొప్పళ జిల్లా కుకనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక మంత్రిని చేయాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. మరిన్ని సంక్షేమాలు అమలు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మహిళలకు శక్తి గ్యారెంటీ పేరిట ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టే 65ఏళ్లు పైబడిన పురుషులకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు.

బీఎస్పీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ



మీడియాతో చిన్నప్ప వై చిక్కహాగడె

దొమ్మసంద్ర, ఏప్రిల్ 15: బెంగళూరు గ్రామీణ జిల్లా లోక్‌సభ బరిలో ఉన్న బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి డాక్టర్ చిన్నప్ప వై చిక్కహాగడె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను చంపేస్తామనే బెదరింపు ఫోన్‌కాల్స్ పలుమార్లు వచ్చాయన్నారు. ఈ విషయాన్ని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మారసంద్ర మునియప్ప దృష్టికి తెచ్చానన్నారు. ఆయన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. తన ప్రాణ రక్షణకోసం నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు వివరించారు.

వీలింగ్ చేస్తూ గుంతలో పడి యువకుడి మృతి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కెంగేరి పరిధిలోని కొమ్మఘట్ట సర్కిల్‌లో జలమండలి తవ్విన గోతిలో వీలింగ్ చేస్తూ వెళ్లిన యువకుడి పడి మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డాడు. జేజే నగర్‌కు చెందిన సద్దాం పాషా (20) మృతి చెందగా ఇమ్రాన్ పాషా, ముబారక్ పాషాలు గాయపడ్డారు. ఒకే స్కూటర్‌పై ముగ్గురు ప్రయాణిస్తుండగా జలమండలి పైప్‌లైన్‌కోసం తవ్విన గుంతలో పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటలకు చోటు చేసుకున్న ఘటనలో సద్దాం పాషా మృతి చెందాడు. వీలింగ్ చేసుకుంటూ వెడుతూ వాహనం అదుపు తప్పి గుంతలో పడింది. వెంటనే గమనించిన స్థానికులు ముగ్గురినీ ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర గాయాలపాలైన సద్దాంపాషా మృతి చెందాడు. మిగిలిన ఇరువురు ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. కెంగేరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సెలవుల్లో చిన్నారుల కోసం ట్రోల్ విలేజ్ సందడి



జారుడుబండ పై చిన్నారులు

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు సరదాగా గడిపేందుకోసం ఫినిక్స్ మార్కెట్ ట్రోల్ విలేజ్‌ను ఏర్పాటు చేసింది. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా పచ్చదనాన్ని ఏర్పాటు చేశారు. మహదేవపురలోని ఫినిక్స్ మార్కెట్ సిటీలో ఏర్పాటు చేసిన ట్రోల్ విలేజ్ అన్ని వర్గాలను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు సరదాగా ఆటలాడేందుకు వీలుగా ఉండేలా ట్రోల్ విలేజ్‌ను తీర్చారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థి రోడ్‌షో

పావగడ, ఏప్రిల్ 15: కాంగ్రెస్‌పార్టీ ఎంపీ చిత్రదుర్గం అభ్యర్థి చంద్రప్ప మంగళవారం తాలూకా వ్యాప్తంగా రోడ్‌షో నిర్వహించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు రామాంజనప్ప తెలియజేశారు. ఉదయం 10 గంటలకు లింగదహళ్లి, వదనకల్లు, అరసికెరె, కేటీ హళ్లి గ్రామ పంచాయతీలలో రోడ్‌షో ముగుస్తుందన్నారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు వైఎన్ హొసకోట ప్రాంతంలోని గ్రామ పంచాయతీల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప పాల్గొంటారని ఆయన తెలిపారు.

శాస్త్రోక్తంగా సామూహిక ధర్మోపనయనాలు



సామూహిక ధర్మోపనయనాలు నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15 : బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సోమవారం సామూహిక ధర్మోపనయనాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 18 మంది వటువులు హాజరై ఉపనయనాలు చేయించుకున్నారు. వేదపండితులు ముక్కాల విద్యాధరశాస్త్రి, కోడూరు అమర్‌నాథ్‌శర్మ నేతృత్వంలో అర్చకబృందం వేదమంత్రాలు వల్లిస్తూ వటువులకు బ్రహ్మోపదేశం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శంకరాచార్యుల ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేసి.. పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదన అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో పెద్దఎత్తున అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం అధ్యక్షుడు యస్.శివరామ్, కార్యదర్శి సాయిశివరాం, సహాయ కార్యదర్శి రఘురామారావు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డి రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు రావాల్సిన వేతనంలో ఒక్కొక్కరి నుంచి రూ.2వేలు కోత విధించడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో ఫేస్-4 రాయదుర్గం, కళాణదుర్గం కార్మికులు గత 15 సంవత్సరాలుగా 600 గ్రామాల ప్రజలకు 280 మంది కార్మికులు నిరంతరం తాగునీరందిస్తున్నారన్నారు. వీరికి 2022 నుంచి కాంట్రాక్టర్ శివారెడ్డి రూ.16,500 వేతనం, రూ.1,500 పీఎఫ్‌తో కలిపి మొత్తం 18వేలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి కేవలం రూ.14,250 మాత్రమే వేతన మిస్తున్నాడని, పీఎఫ్ కట్టడం లేదని పేర్కొన్నారు. వేతనం కూడా ఈనెల 12న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో చెల్లించాడని పేర్కొన్నారు. అందు లోనూ 20 మంది కార్మికులకు ఇప్పటికీ వేతనాలు జమ చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డికి ఎలాంటి అనుభవమూ లేదని, అందువల్లనే కార్మికుల గోడు ఆయనకు పట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా పూర్తి వేతనం చెల్లించి, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, ఒన్నూరుస్వామి, నరేష్, అశోక్, రమేష్, ప్రకాష్, చిత్తప్ప, రాందాస్, శివ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు